
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



సోమశిలలో 22.59 టీఎంసీలు

చేజర్ల(సోమశిల) : సోమశిల జలాశయంలో గురువారానికి 22.595 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 453 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,460
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,624
సవర (8 గ్రాములు)	రూ.44,992

గరిష్టం/కనిష్టం
33.5 /26.5

వాతావరణం

వాతావరణంలో తేమ 62 శాతంగా ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం శుక్రవారం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం లక్ష్యం



ఉపాధి కూలీలతో నాగార్జున్‌రెడ్డి

సీతారామపురం: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాదువు మహిళలు, సచివాలయ, వైద్య సిబ్బంది, తదితరులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దేవిశెట్టిపల్లిలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలను ఆరాతీశారు. బసినేనిపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, హౌసింగ్ డీఈ రామకృష్ణ, ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఈఓపీఆర్డీ భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు (లీగల్): జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ తొమ్మిదిన నిర్వహించనున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, కోట, ఉదయగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట కోర్టుల్లో నిర్వహించనున్నామని చెప్పారు. సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాలు, కుటుంబ తగాదాలు, పారిశ్రామిక వివాదాలు, రాజీకి అనువైన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వర్ణాల చెరువు అభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు సిటీ: నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద అభివృద్ధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్వర్ణాల చెరువు పరిసరాల్లో అధికారులతో కలిసి గురువారం పర్యటించిన ఆయన మాట్లాడారు. స్వర్ణాల చెరువు వెంబడి నడక మార్గం, ప్రహరీల నిర్మాణం, సస్పెన్షన్ బ్రిడ్జి, తదితర నిర్మాణాలపై ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. ఇంజినీరింగ్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, డీఈఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

2025 నాటికి టీబీ కనుమరుగు



రికార్డులను పరిశీలిస్తున్న సమంత

కోవూరు: దేశంలో 2025 నాటికి టీబీని పూర్తిగా పారదోలేలా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ సమంత పేర్కొన్నారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. జిల్లాలో 52 పీహెచ్‌సీలతో పాటు 42 మైక్రో సెంటర్లున్నాయని, ఇక్కడ గళ్ల పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. జిల్లాలో 2590 మంది టీబీ రోగులు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వైద్యుల సూచనలను పాటిస్తే ఆర్నెల్లో వ్యాధి నయమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ల్యాబ్‌లో పలు రికార్డులను పరిశీలించారు.

డ్వామా ఏపీడీగా సుజాత

నెల్లూరు(పొగతోట): డ్వామా అడిషనల్ పీడీగా సుజాతను నియమిస్తూ ఆ శాఖ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో ఏపీడీగా ఆమె విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అసిస్టెంట్ పీడీ నిర్మలారెడ్డిని మాతృశాఖకు బదిలీ చేశారు.

సేద్యమే మా గమ్యం



వైట్ కాలర్ ఉద్యోగాలు.. లక్షల్లో జీతాలు.. కానీ ఇవేవీ సంతృప్తినివ్వవని కొందరు భావిస్తున్నారు. ఉన్నత చదువులు చదివి.. పెద్ద ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉన్నా, వ్యవసాయంలోనే సంతృప్తి ఉంటుందని నమ్ముతున్నారు. ఇదే కోవలో జిల్లాకు చెందిన హర్ష, విష్ణుతేజ నిలుస్తున్నారు. అన్నం పెట్టే రైతుల బాధలను కొంతైనా తీర్చాలనే ఉద్దేశంతో తాము వ్యవసాయ రంగాన్ని ఎంచుకున్నామని వీరు పేర్కొంటున్నారు.

వ్యవసాయం వైపు పట్టభద్రుల అడుగులు

- ఆధునిక పద్ధతుల అవలంబన
- రైతు సుభిక్షంగా ఉంటేనే సమాజం బాగు
- నవీన పంథాలో యువత ముందడుగు

బుచ్చిరెడ్డిపాళెం: వ్యవసాయం వైపు పట్టభద్రులు అడుగులేస్తున్నారు. వాస్తవానికి పలువురు రైతులు తమ పిల్లలు రైతులుగా మారాలని కోరుకోవడం లేదు. వ్యవసాయంలో కష్టపడటం తప్ప ఆర్థికంగా మిగిలేది లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. అయితే దీనికి భిన్నంగా కొందరు రైతుల బిడ్డలు సేద్యం వైపు దృష్టి సారించి అధిక దిగుబడులు సాధిస్తూ తామేమిటో నిరూపిస్తున్నారు.

బీటెక్ టు ప్రకృతి వ్యవసాయం

విడవలూరు మండలం పటేల్‌నగర్‌కు చెందిన వేటగిరి మల్లికార్జున, మీనాక్షి దంపతుల మొదటి సంతానం హర్ష తిరుపతిలోని విద్యానికేతన్ కళాశాలలో బీటెక్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదివారు. అనంతరం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో కొంతకాలం ఈడీడీఏగా పనిచేశారు. పెద్ద ఉద్యోగావకాశాలు వచ్చినా, రైతుగానే దేశానికి సేవ చేయాలనే ఆలోచనతో సీవీఆర్ పద్ధతి ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్నారు. రెండెకరాల్లో ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల రోటరీ క్లబ్‌తో పాటు కలెక్టర్ అభినందించారు.



దుక్కి దున్నుతున్న హర్ష

సోషల్ మీడియా సహకారం

రైతులకు పెట్టుబడులు తగ్గించి వరి సాగు చేసే పద్ధతుల కోసం సోషల్ మీడియాలో శోధించారు. ఈ క్రమంలో సుభాష్ పాలేకర్ అవలంబిస్తున్న వ్యవసాయ పద్ధతులు, కొరియాకు చెందిన రైతు చొహాన్‌క్యూ చేసిన భూసార వ్యవసాయాన్ని చదివారు. అయితే చింతల వెంకటరెడ్డి (సీవీఆర్) పద్ధతి ద్వారా సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం ద్వారా అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు పొంది సాగు చేస్తున్నారు.

మట్టి, నీరుతో సాగు

సీవీఆర్ పద్ధతి ద్వారా కేవలం నీరు, మట్టితోనే వరి సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. సాధారణంగా వరి సాగు చేస్తే ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చవుతుంది, అయితే సీవీఆర్ పద్ధతి ద్వారా రూ.12 వేలే ఖర్చు కానుంది.

బాధతో పెరిగిన ఆలోచన

తన తాత వేటగిరి రమణయ్య, తండ్రి మల్లికార్జున వ్యవసాయం చేసే కుటుంబాలను పోషిస్తున్నారు. అయితే పెట్టుబడులు పెరుగుతున్నా.. దిగుబడులు మాత్రం తగ్గుతున్నాయి, గిట్టుబాటు ధరల్లేవని ఆందోళన చెందేవారు. ఈ విషయం హర్షను కలిచివేసింది. సరైన దిగుబడులు.. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనే ఆవేదన హర్షలో నూతన ఆలోచనకు తెరలేపింది.

రైతుల కష్టాలను తీర్చేందుకే..



రైతుల కష్టాలను కళ్లారా చూశా. తాత, తండ్రి ఏటా పడుతున్న వ్యవసాయ కష్టాలను చూసి రైతుల కన్నీరు తుడవాలనే తపనతో సీవీఆర్ పద్ధతి ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేస్తున్నా. ప్రస్తుతం ఎకరాకు రూ.12 వేల ఖర్చుతో దాదాపు మూడు పుట్లు పండించేందుకు సిద్ధమయ్యా.

– వేటగిరి హర్ష



నీటిలో మట్టిని కలుపుతూ..

తండ్రి మార్గంలోనే పొలంబాట

కొడవలూరు మండలం గండవరానికి చెందిన దామోదర్‌రెడ్డి, కల్యాణి దంపతుల మొదటి సంతానమైన విష్ణుతేజ తన తండ్రి చేస్తున్న వ్యవసాయాన్నే ఎంచుకొని ముందుకు సాగారు. గండవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి, వాకాడులోని ఎన్బీకేఆర్ కళాశాలలో అగ్రికల్చర్ డిప్లొమా చేశారు. ప్రభుత్వోద్యోగం పొందే అవకాశం ఉన్నా, పొలంబాట పట్టారు.



ఎద్దు సాయంతో నూనెను తయారు చేస్తున్న యంత్రం

సేంద్రియ వ్యవసాయమే ముద్దు

తనకున్న 3.5 ఎకరాల్లో వరి, చిరుధాన్యాలను గో ఆధారిత పద్ధతులతో సాగు చేయడం ప్రారంభించారు. జీవామృతం, ఘన జీవామృతం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, నీమాస్త్రం వంటి పద్ధతులతో అతి తక్కువ పెట్టుబడితో వరి సాగు చేపట్టారు. కరోనా సమయం నుంచి ఈ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. అధిక దిగుబడులను సాధించడం ద్వారా వ్యవసాయంలోనూ సంతోషం ఉంటుందని నిరూపించారు.



జీవామృతాన్ని వెదజల్లుతున్న విష్ణుతేజ

గానుగ నూనె తయారీ

గానుగ నూనె తయారీతో జిల్లా ప్రజలను విష్ణుతేజ ఆకట్టుకుంటున్నారు. తన ఇంటి ఆవరణలోనే ఎద్దుతో గానుగ యంత్రాన్ని ఉంచి అందులో వేరుశనగ, బాదం, నువ్వులు, కొబ్బరితో నాణ్యమైన నూనెను తయారు చేసి ఇస్తున్నారు. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు విష్ణుతేజ వద్దకు వచ్చి స్వచ్ఛమైన నూనెను తయారు చేసుకొని తీసుకెళ్తున్నారు.

తక్కువ పెట్టుబడితో..



వ్యవసాయం చేయాలనే లక్ష్యంతో అగ్రికల్చర్ డిప్లొమా చేశా. మంచి మార్కులొచ్చినా ప్రభుత్వోద్యోగం చేయకుండా తండ్రి బాటలోనే వ్యవసాయం చేసి రైతులకు అండగా నిలవాలనుకున్నా. ఇందులో భాగంగా సేంద్రియ వ్యవసాయాన్ని నమ్ముకొని.. అతి తక్కువ పెట్టుబడులతో సేద్యం చేస్తున్నా. జిల్లా వాసులకు స్వచ్ఛమైన గానుగ నూనెను తయారు చేసి ఇస్తున్నా.

– విష్ణుతేజ

నవ్విపోదురుగాక నాకేటి..!

- ఓటమి భయంతో సోమిరెడ్డి అడ్డదారులు
- పచ్చ కండువాలు కప్పుకొంటే ప్యాకేజీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నవ్విపోదురుగాక నాకేటి అనే రీతిలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యవహారం సాగుతోంది. ఓడిపోతామనే భయంతో రోజుకో రకంగా ఆయన అడ్డదారులు తొక్కుతూ నవ్వులపాలవుతున్నారు. మూడు సార్లు ఓడిపోయిన వారికి సీటివ్వమని ఆ పార్టీ నేత లోకేశ్ స్పష్టం చేయడంతో ఎలాగైనా దక్కించుకోవాలనే లక్ష్యంతో నానా పాట్లు పడుతున్నారు. పక్క పార్టీలోని వారు టీడీపీలో చేరుతున్నారని చూపేందుకు ఆయన ఆడుతున్న డ్రామాలను చూసి ముక్కున వేలేసుకోవడం ప్రజల వంతవుతోంది.

పిలిచి.. ఆపై కండువాలు కప్పి

తాజాగా పొదలకూరు మండలం నావూరుపల్లిలో మంగలి రంగయ్య, పిల్లిపాక పొండయ్యకు పసుపు కండువాలు కప్పి వారు టీడీపీలో చేరారని సోమిరెడ్డి ప్రకటించారు. వాస్తవానికి ఆ ఇద్దరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీరాభిమానులు. తమను పిలిచారనే కారణంతో వెళ్లామని, తీరా కండువాలు కప్పి మోసం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలోనూ ఇంతే..

వెంకటాచలం మండలంలో 150 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు టీడీపీలో చేరారని గతంలో ప్రకటన చేశారు. నియోజకవర్గానికి చెందిన వారెవరూ లేకపోవడంతో విచారిస్తే, వీరందరూ నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలుగా తేలింది. ఇలా టీడీపీ బలం పెరుగుతోందని చూపేందుకు ఆడిన డ్రామా బెడిసికొట్టింది. నియోజకవర్గంలోని కొందరు అమాయకులను పిలిచి.. పార్టీ కండువా కప్పుకొంటే ప్యాకేజీ ఇస్తానంటూ సోమిరెడ్డి బతిమిలాడుతుండటంపై ఆ పార్టీ నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



చెన్నైలో ఆర్టీసీ బస్సు దగ్ధం

- డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితం

ఆత్మకూరు: ఆత్మకూరు నుంచి చెన్నై వెళ్తున్న ఆర్టీసీ బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. డ్రైవర్ హుస్సేన్ వివరాల మేరకు.. ఆత్మకూరు నుంచి బయల్దేరిన బస్సు చెన్నైలోని మాధవరం బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో మొరాయించింది. ఫోన్ ద్వారా డిపో ఏఎంఎఫ్‌కు డ్రైవర్ సమాచారమిచ్చారు. ఆయన సూచనల మేరకు చిన్నపాటి మరమ్మతులు చేసి బస్సును కదిలించారు. కొంత దూరం వెళ్లగానే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ హుస్సేన్, కండక్టర్ ఎమ్మెస్ రెడ్డి అప్రమత్తమై బస్సులోని 42 మంది ప్రయాణికులను వారి లగేజీలతో సహా దింపేశారు. కొన్ని నిమిషాల్లోనే బస్సు మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. సమాచారాన్ని ఆత్మకూరు, నెల్లూరు డిపో అధికారులకు తెలియజేశారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ వెబ్ ఆప్షన్లు

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్‌లో సీట్ల భర్తీకి వెబ్ ఆప్షన్ల ప్రక్రియను శుక్రవారం ప్రారంభించనున్నామని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్‌లో ఒకటి నుంచి చివరి ర్యాంక్ వరకు ఆన్‌లైన్లో ఆప్షన్లను ఈ నెల 14 వరకు ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. ఆప్షన్ల ఎంపికలో మార్పులు, చేర్పులు, తప్పులను 16న సరిచేసుకోవచ్చని తెలిపారు. సీట్లను 18న కేటాయించనున్నారని చెప్పారు. సీట్ల కేటాయింపు మెసేజ్ విద్యార్థులు మొబైళ్లకు వస్తుందని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో ఈ నెల 19 నుంచి 23లోపు కళాశాలలను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. తరగతులను ఈ నెల 23న ప్రారంభించనున్నామని వెల్లడించారు. వెంకటేశ్వపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్‌లు, మూడూ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 94936 66009, 94934 57156 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక విభేదాలతో వ్యక్తి కిడ్నాప్

- స్టాంప్ పేపర్లపై బలవంతంగా సంతకాలు
- పోలీసుల రాకతో నిందితుల పరార్

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాల నేపథ్యంలో వ్యక్తిని కొందరు కిడ్నాప్ చేసిన ఘటన నగరంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. చేజర్ల మండలం మాముదూరుకు చెందిన రంగారెడ్డి హైదరాబాద్ సమీపంలోని పఠాన్‌చెరువులో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. జిల్లాకు చెందిన కుప్పుస్వామితో ఈయనకు ఆర్థిక విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు పనుల నిమిత్తం నెల్లూరుకు బుధవారం రంగారెడ్డి వచ్చారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో టీ తాగేందుకు సుందర్ లాడ్జి సమీపంలోని దుకాణానికి వెళ్లారు. అక్కడ కుప్పుస్వామి తారసపడగా, వీరి మధ్య వివాదం చెలరేగింది. కుప్పుస్వామి దాడి చేయగా బాధితుడు తప్పించుకొని పరుగులు తీశారు. ఈ క్రమంలో బైక్‌లో కుప్పుస్వామి.. ఆయన అల్లుడు భాస్కర్, అతని స్నేహితులు కారులో రంగారెడ్డిని వెంబడించారు. కొద్ది దూరం వెళ్లాక ఆయన్ను కారులో బలవంతంగా ఎక్కించుకొని కొండాయపాళెం గేట్ సమీపంలోని మిలటరీ కాలనీ రెండో వీధిలోకి తీసుకెళ్లారు. అక్కడ అతని చేతికున్న ఐదు ఉంగరాలను బలవంతంగా లాక్కున్నారు. రూ.100 ఖాళీ బాండ్లపై సంతకాలు చేయించుకొని.. మరుసటి రోజు స్థలాన్ని రిజిస్టర్ చేయాలని.. లేని పక్షంలో చంపుతామని ఫోన్లో రంగారెడ్డి కుమారులను బెదిరించారు. బాధితుడి కుమారుడి ద్వారా సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. విషయాన్ని పసిగట్టిన నిందితులు.. రంగారెడ్డిని వదిలి పరారయ్యారు. కిడ్నాప్ చేసిన ప్రాంతం చిన్నబజార్ పరిధిలోకి రావడంతో బాధితుడ్ని అక్కడికి పంపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా విషయం బయటకు పొక్కకుండా పోలీసులు రహస్యంగా విచారణ జరుపుతున్నారు.

ఎన్‌కేబీసీలో సమస్యలు పరిష్కరిస్తాం

కొండాపురం: చింతలదేవి పంచాయతీలోని నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్ (ఎన్‌కేబీసీ)లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్‌కేబీసీ క్షేత్రంలో గురువారం నిర్వహించిన సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రాన్ని ఇక్కడ నెలకొల్పడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ఈ క్షేత్రంలో సాగు నీరు దొరికే అవకాశం తక్కువగా ఉందని, విషయాన్ని కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, తదితరుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మర్రిగుంట చెరువు నుంచి ఎన్‌కేబీసీలో ఏర్పాటు చేసిన సంపులకు నీటిని తరలించేందుకు గానూ రూ.12 కోట్లతో పనులను చేపట్టగా, 90 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రాజెక్టు దరిదాపుల్లో సోమశిల ఉత్తర కాలువ వెళ్తుందని, దీని ద్వారా నీటిని అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. అనంతరం గోవు, జమ్మి చెట్టుకు పూజలు చేశారు. ప్రాజెక్ట్ డీడీ పెద్దిస్వామి, జేడీ వెంకటేశ్వర్లు, ఏడీ రామన్, తదితరులు పాల్గొన్నారు.



గోవుకు పూజలు చేస్తున్న విజయ్‌కుమార్, తదితరులు

రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: గడిచిన నాలుగేళ్లలో రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారని, ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పరిష్కరించారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు, కలెక్టర్ హరినారాయణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అనేక రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గానూ సదస్సును నిర్వహించామని వివరించారు. నియోజకవర్గంలో 21 వేల ఎకరాల అసైన్డ్ భూములతో పాటు ఐదు వేల మంది రైతులకు మేలు చేకూరేలా సాదాబైనామా సమస్యలు తీరనున్నాయని వివరించారు. నాలుగు నెలల వ్యవధిలో భూ సమస్యలను పరిష్కరించేలా తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. తొలుత మంత్రికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సత్కరించారు.



భూ హక్కు పత్రాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన, చిత్రంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్

ప్రజలకు మేలు చేయడమే లక్ష్యం

ప్రజలు, రైతులకు మేలు చేయడమే రెవెన్యూ శాఖ లక్ష్యమని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జిల్లాలోని 118 గ్రామాల్లో భూముల రీ సర్వేను ఇప్పటికే పూర్తి చేసి రైతులకు భూ హక్కు పత్రాలను అందించామని, మరో 40 గ్రామాల్లో త్వరలో పూర్తి చేయనున్నామని వెల్లడించారు. చుక్కల భూములకు సంబంధించి 43 వేల ఎకరాలకు విముక్తి లభించిందన్నారు. అనంతరం రైతులకు భూ, ఇళ్ల హక్కు పత్రాలను మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. జేసీ కూర్మనాథ్, డీపీఓ సుస్మిత, ఆర్డీఓ కరుణకుమారి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గురుమోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, పార్టీ ఉదయగిరి ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నేతలు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై దృష్టి

నెల్లూరు(దర్గామిట్ట): సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఫ్యామిలీ ఫిజిషియన్ విధాన అమలు, సుస్థిరాభివృద్ధి ఇండికేటర్స్ లక్ష్యసాధన, మహిళల ఆరోగ్యం, పిల్లల సంక్షేమం, తదితరాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వర్చువల్‌గా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, డీఈఓ గంగాభవానీ, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, తదితరులు హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, తదితరులు

ముంబై హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ముంబై హైవేపై ట్యాంకర్‌ను ట్రావెల్ బస్సు ఢీకొనడంతో రెండు వాహనాల కేబిన్లలో చిక్కుకుని డ్రైవర్లు మృతి చెందారు. కొడవలూరు మండలంలో ఇఫ్కో కిసాన్ సెజ్ వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాలీని యాసిడ్ ట్యాంకర్ ఢీకొనడంతో ట్రాలీ డ్రైవర్ ప్రాణాలు విడిచాడు. మనుబోలు మండలంలో లారీ ఢీకొనడంతో ఓ అర్చకుడు దుర్మరణం పాలయ్యాడు.

- టైరు పేలడంతో అదుపుతప్పి ట్యాంకర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్
- కేబిన్లలో ఇరుక్కుని ఇద్దరు డ్రైవర్లు మృతి


ఎదురెదురుగా ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు, ట్యాంకర్. కేబిన్‌లో డ్రైవర్ అహ్మద్‌బాషా మృతదేహం


బస్సు కేబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌కు చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఆర్ఆర్‌నగర్, మతం గ్రామాల మధ్యన ముంబై జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అతివేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు టైర్ పేలడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కేబిన్‌లలో చిక్కుకుని ఇద్దరు డ్రైవర్లు మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు..హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వరి ప్రైవేట్ ట్రావెల్స్ రోజూలాగే బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి బుచ్చిరెడ్డిపాళేనికి ప్రయాణికులతో బయలుదేరింది. గురువారం ఉదయం నెల్లూరుకు చేరుకుంది. అక్కడ నెల్లూరు ప్రయాణికులను దించివేసింది. అనంతరం ముగ్గురు ప్రయాణికులతో బుచ్చిరెడ్డిపాళేనికి బయలుదేరింది. దగదర్తి మండలం యలమంచిపాడు గ్రామానికి చెందిన షేక్ చాంద్‌బాషా (39) ట్రావెల్స్ బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ఆరోగ్యం సరిగా లేదని ఇంటి నుంచి ఫోన్ రావడంతో ఆయన గంటకు 90 కిలోమీటర్ల వేగంతో బస్సును నడపసాగాడు. ఉదయం 8 గంటలకు ఆర్ఆర్‌నగర్, మతం గ్రామాల మధ్యకు బస్సు చేరుకోగానే కుడి వైపు ముందు టైర్ పేలిపోయింది. దీంతో బస్సు పూర్తిగా అదుపు తప్పి రాంగ్‌రూట్‌లోకి వెళ్లింది. అదే సమయంలో బళ్లారి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్, బస్సు కేబిన్లు నుజ్జునుజ్జు అయ్యాయి. డ్రైవర్లు అందులో చిక్కుకుపోయారు. ముంబైకి చెందిన ట్యాంకర్ డ్రైవర్ అహ్మద్‌బాషా (44) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ తీవ్రగాయాలతో కేబిన్‌లో చిక్కుకుపోగా, మరో ముగ్గురు ప్రయాణికులు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వచ్చిన పెద్ద శబ్దం విని సమీప గ్రామాల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు, 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. 108 వాహన సిబ్బంది బస్సులోకి వెళ్లి కొన ఊపిరితో ఉన్న డ్రైవర్‌కు ప్రథమ చికిత్స అందిస్తుండగా, పోలీసులు అరగంట సేపు శ్రమించి కేబిన్ నుంచి డ్రైవర్‌ను బయటకుతీశారు. అయినప్పటికీ ఫలితం లేదు. అరగంట పాటు కేబిన్‌లో నరకయాతన అనుభవించిన డ్రైవర్ ప్రాణాలు విడిచాడు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.


చాంద్‌బాషా (ఫైల్)


ప్రమాద ఘటనతో ముంబై హైవేపై నిలిచిన వాహనాలు

స్తంభించిన ట్రాఫిక్

ముంబయి రోడ్డుపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఇరువైపులా దాదాపు గంట పాటు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై వీరప్రతాప్ తన సిబ్బందితో ముందుగా బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరు వెళ్లే వాహనాలను జొన్నవాడ మీదుగా మళ్లించారు. ట్రాక్టర్, క్రేన్ సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డు పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దైవ సేవకు వెళ్తుండగా..

- లారీ ఢీకొని అర్చకుడి దుర్మరణం

మనుబోలు: మండలంలోని వెంకన్నపాళెం సమీపంలో గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువ అర్చకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికుల వివరాల మేరకు.. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం గుంటుపల్లికి చెందిన శ్రీవైష్ణవ రాధాకృష్ణ(18) తన సోదరుడితో కలిసి మండలంలోని కట్టువపల్లిలో నివాసం ఉంటూ చుట్టుపక్కల ఆలయాల్లో అర్చకుడిగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం పారిచర్లపాళెంలోని ఆలయంలో పూజలు చేసేందుకు పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. వెంకన్నపాళెం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో రోడ్డు మార్జిన్ సక్రమంగా లేక బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బంధువులకు సమాచారం అందజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ప్రమాదానికి కారణమైన లారీ


రాధాకృష్ణ మృతదేహం

ఆగిఉన్న ట్రాలీని ఢీకొన్న యాసిడ్ ట్యాంకర్

- ట్రాలీ చక్రాల కింద నలిగి డ్రైవర్ మృతి

కొడవలూరు: మండల పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ సమీపంలో గురువారం మరమ్మతులకు గురవడంతో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న ట్రాలీని వెనుకగా యాసిడ్ ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలీ చక్రాల కింద నలిగి దాని డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై జీ సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి ఐరన్ లోడుతో చెన్నైకు బయలుదేరిన ట్రాలీ ఇఫ్కో కిసాన్ సెజ్ సమీపంలోకి రాగానే హఠాత్తుగా వీల్ జాయింట్ కట్ అవడంతో రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో ట్రాలీ డ్రైవర్ వెంకటరత్నం(40) కిందకు దిగి జాయింట్‌ను పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో ట్రాలీని వెనుకగా అతివేగంగా వచ్చిన యాసిడ్ ట్యాంకర్ ఢీకొంది. దీంతో ట్రాలీ ముందుకు వెళ్లడంతో వెనుక చక్రాల కింద నలిగి ట్రాలీ డ్రైవర్ వెంకటరత్నం అక్కడకక్కడే మృతి చెందారు. యాసిడ్ ట్యాంకర్ ముందు భాగం బాగా దెబ్బతింది. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన ట్యాంకర్ డ్రైవర్ దండుబోయిన నాగేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు వెంకటరత్నాన్ని విజయవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ట్రాలీ చక్రాల కింద నలిగిన వెంకటరత్నం మృతదేహం

క్లుప్తంగా

నమ్మకంగా ఉంటూ మోసం

- బంగారు ఆభరణాలు కాజేసిన నిందితుడి అరెస్ట్
- 326 గ్రాముల బంగారు స్వాధీనం


నెల్లూరు(క్రైమ్): నమ్మకంగా ఉంటూ మరమ్మతులకు ఇచ్చిన బంగారు ఆభరణాలను కాజేసిన కేసులో నిందితుడ్ని చిన్నబజారు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 326 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు..కొత్తకాలువ సెంటర్‌కు చెందిన కే వినోద్‌కుమార్ నగరంలోని ఆచారివీధిలోని ముఖేష్ జ్యూవెలరీస్‌లో రిపేర్ సెక్షన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. వెంకటేశ్వరపురానికి చెందిన షేక్ గౌస్‌బాషా కొరడావీధిలో బంగారు ఆభరణాల తయారీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆయన గడిచిన రెండేళ్లుగా ముఖేష్ జ్యూవెలరీస్ బంగారు ఆభరణాలకు మరమ్మతులు, నూతన ఆభరణాల తయారీ చేస్తూ ఎంతో నమ్మకంగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో 338.340గ్రాముల బంగారు ఆభరణాలను జ్యూవెలరీస్ నిర్వాహకులు మరమ్మతుల నిమిత్తం గౌస్‌బాషాకు ఇవ్వగా వాటిని కాజేశాడు. బాధితులు పలుమార్లు గౌస్‌బాషాను నిలదీయగా సమాధానం దాటేస్తూ వచ్చాడు. దీంతో వినోద్‌కుమార్ ఇటీవల చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడు గౌస్‌బాషాపై ఛీటింగ్ కేసు నమోదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై లతీఫున్నీసా క్రైమ్ ఏఎస్‌ఐ శ్రీహరి, హెచ్‌సీ సురేష్, తదితరులతో కలిసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం సర్వోదయ కళాశాల గేటు సమీపంలో గౌస్‌బాషాను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.16.50 లక్షల విలువ చేసే 326 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

చీటింగ్ కేసు నమోదు


నెల్లూరు(క్రైమ్): స్థలం రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఓ వృద్ధురాలిని నమ్మించి నగదు కాజేసిన వ్యక్తిపై వేదాయపాళెం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంట పెద్దబావి సెంటర్‌లో అనసూయమ్మ నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన గంగాధర్ ఆమెకు బాగా తెలుసు. రెండేళ్ల కిందట గంగాధర్ ఆమె ఇంటికి వచ్చాడు. సప్తగిరికాలనీలో తన స్నేహితుడికి 33 అంకణాల స్థలం ఉందని, దాన్ని అమ్మాలని చూస్తున్నాడని, దాన్ని నీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయిస్తానని ఆమెకు చెప్పి పలు దఫాలు రూ.12లక్షలు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా స్థలం రిజిస్ట్రేషన్ ఊసెత్తలేదు. దీంతో గంగాధర్‌ను బాధితురాలు కలువగా రేపు, మాపూ అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు. ఇటీవల గట్టిగా నిలదీయగా స్థలం రిజిస్ట్రేషన్ లేదు? ఏమి లేదు? ఏమి చేస్తావా చేసుకో అంటూ ఆమెను నానా దుర్భాషలాడాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.133
లేయర్	రూ.88
బ్రాయిలర్ చికెన్:	రూ.230
స్కిన్‌లెస్ చికెన్:	రూ.256
లేయర్ చికెన్:	రూ.150

ఆర్థిక ప్రగతికి రామాయపట్నం పోర్టు దిక్సూచి

- కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

కందుకూరు : రాష్ట్రానికి ఉన్న సుదూరమైన సముద్రతీరాన్ని ఉపయోగించుకుని భారీ ఎత్తున తీరప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు ప్రతిరూపమే రామాయపట్నం పోర్టు నిర్మాణమని, భవిష్యత్‌లో పోర్టు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఓ దిక్సూచిలా నిలవబోతుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రామాయపట్నంపోర్టు వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు పోర్టు పనులు చురుగ్గా సాగడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి వారికి ప్రస్తుతం పూర్తయిన పనులే సమాధానమన్నారు. ప్రైవేట్ యాజమాన్యంలో చేపట్టిన కృష్ణపట్నం పోర్టు పనుల కాలం కంటే ప్రస్తుతం రామాయపట్నం పోర్టు పనుల పురోగతి మూడేళ్ల ముందంజలో ఉందన్నారు. డిసెంబర్ నాటికి మొదటి బెర్త్‌ను పూర్తి చేసి ఎగుమతి, దిగుమతులు ప్రారంభిస్తామన్నారు. దీని వల్ల మారిటైంబోర్డుకు పోర్టు నిర్మాణం భారం కాకుండా ఉంటుందన్నారు. బొగ్గు దిగుమతి కోసం ప్రత్యేకంగా బెర్తును నిర్మించనున్నట్లు తెలిపారు. జిందాల్ స్టీల్ కంపెనీకి రెండు బెర్తులు కేటాయించినట్లు చెప్పారు. ఏపీ మారిటైం బోర్డుతో కంపెనీ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నారని, త్వరలోనే బెర్తుల నిర్మాణం కూడా ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది

పోర్టు నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటికే ఖాళీ చేసిన మొండివారిపాళెం, ఆవులవారిపాళెం గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద భూములు కేటాయించామని చెప్పారు. నిర్వాసిత కాలనీల పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. రెండో దశలో కర్లపాలెం, సాలిపేట గ్రామాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వారికి అవసరమైన భూముల కోసం పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు సముద్రభూములుగా పెండింగ్‌లో ఉన్న వాటిని సర్వే చేసి ఏడబ్ల్యూ భూములుగా గుర్తించి పరిహారం కోసం కలెక్టర్ ప్రతిపాదనలు పంపారని చెప్పారు. ఇప్పటికే పోర్టు నిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. పోర్టు ప్రధానాధికారి పెరుమాళ్, అరబిందో ఇన్‌ఫ్రా జీఎం భీముడు, పోర్టు జనరల్, ప్రాజెక్ట్ మేనేజర్ శేషుకుమార్, పోర్టు రోడ్డు అండ్ రైల్వే డీఎం మేనేజర్ చెంచురెడ్డి, రామాయపట్నం పోర్టు అభివృద్ధి కార్పొరేషన్ ఎస్ఈ భరత్, ఈఈ శివశంకర్, సేఫ్టీ మేనేజర్ పోలారావు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల సూత్రధారిని అరెస్ట్ చేయాలి

- సోమిరెడ్డిని పూర్తిస్థాయిలో విచారించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య




వెంకటాచలం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెంకటాచలం: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అండతో కనుపూరు చెరువు మట్టి మాఫియాకు ప్రధాన సూత్రధారిగా ఉన్న టీడీపీ నాయకుడు బుజ్జినాయుడును వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య డిమాండ్ చేశారు. కనుపూరు చెరువులో మట్టి తవ్వకాలకు సంబంధించి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని సమగ్ర విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెంకటాచలం పోలీసుస్టేషన్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం సీఐ కే రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ ఈ నెల 6న కనుపూరు చెరువు నుంచి మట్టి తరలిస్తుండగా సోమిరెడ్డి అనుచరుడైన బుజ్జినాయుడు టిప్పర్ ఢీకొని కావలి ఎస్‌బీఐ ఉద్యోగి మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ నాయకులపై రుద్దేందుకు సోమిరెడ్డి పలు జిమ్మిక్కులు చేసి విఫలమయ్యాడని విమర్శించారు. ప్రమాద ఘటన జరిగిన రోజు సోషల్ మీడియాలో వైఎస్సార్‌సీపీపై అవాస్తవాలను సోమిరెడ్డి ప్రచారం చేశారని మండిపడ్డారు. వాస్తవానికి మట్టి తవ్వకాల సూత్రధారి తన అనుచరుడు బుజ్జినాయుడేనని, ప్రమాదానికి కారణమైన టిప్పర్ కూడా ఆయనదేనని తేలడంతో, తెల్లారేసరికి అన్నీ పోస్టులను సోషల్ మీడియా గ్రూపుల్లో నుంచి తొలగించాడని తెలిపారు. రైతుల పేరుతో మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకుని సోమిరెడ్డి అండతో బుజ్జినాయుడు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు, అక్రమ రవాణా చేస్తున్నారని మండిపడ్డారు. మట్టి తవ్వకాల సూత్రధారికి సోమిరెడ్డి అల్లీపురంలోని తన నివాసంలో ఆశ్రయమిచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులు సోమిరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించి, మట్టి తవ్వకాల సూత్రధారి బుజ్జినాయుడును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వేపల్లిలో ఏం జరిగినా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై రుద్దే ప్రయత్నాలను సోమిరెడ్డి ఇకనైనా మానుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యాయత్నం

- టీడీపీ నాయకుడు కప్పిర దంపతుల ప్రోద్బలంతోనేనన్న బాధితులు


గాయపడిన మస్తానీ

నెల్లూరు(క్రైమ్)/సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నాయకుడు కప్పిర శ్రీనివాసులు దంపతుల ప్రోద్బలంతో వైఎస్సార్‌సీపీ నాయకులైన అరవ శౌరీ, మస్తానీ దంపతులపై గురువారం కొందరు కత్తులు, కర్రలతో హత్యాయత్నం చేశారు. ఈ ఘటన నగరంలోని సంతపేట మార్కెట్ వద్ద చోటుచేసుకుంది. బాధితుల సమాచారం మేరకు.. 50వ డివిజన్‌కు చెందిన అరవ శౌరీ, మస్తానీ వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు, రౌడీషీటర్ కప్పిర శ్రీనివాసులు, ఆయన భార్య రేవతి వారిపై తరచూ అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఇటీవల శౌరీ, మస్తానీ అనుచరులను టీడీపీలోకి రావాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. వారు నిరాకరించడంతో కోపంతో రగలిపోయారు. ఈ నేపథ్యంలో గురువారం శౌరీ, మస్తానీ దంపతులు సంతపేట మార్కెట్ వద్ద ఇంట్లో ఉండగా కప్పిర దంపతుల అనుచరులు కే చిన్న, ఇమానుయేలు, సాయిలతో పాటు మరో 12మంది కత్తులు, కర్రలతో వారిపై దాడిచేసి పరారయ్యారు. గాయాలపాలైన వారిని కుటుంబసభ్యులు 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అపోలో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితురాలు అరవ మస్తానీ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, సంతపేట ఇన్‌స్పెక్టర్ బీ కళ్యాణ్‌రాజ్ ఆస్పత్రికి చేరుకుని హత్యాయత్నం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. కప్పిర శ్రీనివాసులు దంపతులతో పాటు మరో 12మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

లారీ డ్రైవర్ హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): లారీ డ్రైవర్ హత్యకేసులో ఏడుగురు నిందితులను చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. వివరాలు..శివగిరికాలనీకి చెందిన షేక్ ఖలీల్(52), ఆఫ్రీన్ దంపతులు. వీరికి రియాజుద్దీన్, లియాజుద్దీన్, సాహిల్ అలియాస్ షకీల్ కుమారులు. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఎంబీఏ చేస్తుండగా, మిగిలిన వారు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. ఖలీల్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 3న ఖలీల్ తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఖలీల్ తన భార్యను నిత్యం వేధించేవాడు. ఆయన తన స్వగ్రామంలోని స్థలంతో పాటు నెల్లూరులోని ఇల్లు తన అన్నదమ్ములకు ఇచ్చేస్తానని పలుమార్లు భార్యకు చెప్పేవాడు. భార్య, పిల్లలను తీవ్రంగా కొట్టేవాడు. ఖలీల్ వేధింపులు రోజురోజుకు అధికమవడంతో అతని కాళ్లుచేతులు విరగ్గొట్టి మంచానికి పరిమితం చేయాలని భార్య ఆఫ్రీన్, కుమారులు లియాజుద్దీన్, సాహిల్ నిర్ణయించుకున్నారు. ఈ నెల 2న రాత్రి ఇద్దరు కుమారులు తమ స్నేహితులైన మనుమసిద్దినగర్‌కు చెందిన షేక్ జాకీర్‌బాషా, డైకస్‌రోడ్డుకు చెందిన షేక్ రబ్బాని, రామచంద్రారెడ్డినగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం, జనశక్తినగర్‌కు చెందిన షేక్ రబ్బాని అలియాస్ పొట్టి రబ్బానీను ఇంటికి పిలిపించి ఖలీల్‌పై దాడిచేశారు. అయితే గాయాలతో ఖలీల్ మృతి చెందడంతో మరుసటిరోజు గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు చేసేందుకు యత్నించారు. మృతుడి అన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో చిన్నబజారు పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించడంతో నిందితులను జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.